

రాచకాలువను సర్వే చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే

## రాచకాలువ కబ్జాకు గురికాకుండా చూడండి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాచకాలువను పూర్తిగా సర్వేచేసి కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ఇరిగేషన్ అధికారులదేనని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంతో ప్రాచీన నేపథ్యం ఉన్న రాచకాలువ సాహెబ్‌నగర్ కలాన్, హయత్‌నగర్‌లోని పలు చోట్ల కబ్జాకు గురైందన్నారు. ఈ రాచకాలువ పక్కనే నేడు పెద్ద, పెద్ద బహుళ అంతస్థులు, గ్రామ పంచాయితి వెంచర్లు వెలిశాయని, మరికొన్ని చోట్ల రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఈ కాలువను తమ వెంచర్‌లో కలిపేసుకున్నారని తెలిపారు. గత 2020-21 సంవత్సరంలో ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీరు పోయే దారిలేక అనేక కాలనీలు వరదముంపుకు గురయ్యాయన్నారు. భవిష్యత్‌లో ఎంత పెద్ద వర్షం వచ్చిన రాచకాలువ పక్కన ఉన్న కాలనీలు ముంపుకు గురికాకుండ ఉండాలంటే రాచకాలువను పూర్తిగా సర్వే చేయించి, కాలువను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, హయత్‌నగర్ ఎమ్మార్వో జానకి, ఇరిగేషన్ డీఈ శుక్లజ, ఏఈ సతీష్, సర్వేయర్ జ్యోతి, కాలనీల అధ్యక్షులు గౌరిశెట్టి మనోజ్ కుమార్, శ్రీశైలం, రాజుగౌడ్, సత్యనారాయణ, సూర్యనాయక్ పాల్గొన్నారు.

## దోమల నివారణ చర్యలు కొనసాగాలి



ఎంటమాలజీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలో మూసీ పరీవాహక ప్రాంత కాలనీల్లో దోమల నివారణ చర్యలు ప్రణాళికాబద్ధంగా కొనసాగాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులను ఆదేశించారు. శనివారం మోహన్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆయన ఎంటమాలజీ జోనల్ హెడ్ సీనియర్ ఎంటమాలజిస్టు రజనీ, ఏఈ రాంబాబు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోమవారం నుండి శనివా రం వరకు కాలనీల్లో దోమల నివారణకు చేపట్టే మస్కిటో లార్వల్ ఆయిల్ (ఎంఎల్‌ఓ)స్ప్రే, ఫాగింగ్ తదితర చర్యలను మరింత మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్లు, రుక్కయ్య, ఫాగింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారిత అవార్డుకు ఉషాకిరణ్ ఎంపిక



వల్లబాయ్ ఉషాకిరణ్

చంపాపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్(ఎన్‌టీఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సా మాజిక విద్య, రాజకీయవేత్త, ఆదివాసి/ఏకలవ్య వల్లబాయ్ ఉషాకిరణ్ మహి ళా సాధికారత 2025 సంవత్సరం అవార్డుకు ఎంపికైనట్లు యామిని స్టూడియో ఫౌండేషన్ చైర్మన్ యామిని కనకతార పేర్కొన్నారు. ఈనెల 17న రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రుల చేతుల మీదుగా ఈ అవార్డు ను ఉషాకిరణ్‌కు అందించనున్నట్లు తెలిపారు. 10సంవత్సరాల నుంచి వేలాది మంది మహిళా నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ అందించి, ఆదివాసి సామాజిక సంస్కృతిని కాపాడటానికి కృషి చేసినందుకు గాను ఉషాకిరణ్‌ను అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. తమ సంస్థ ప్రతి ఏడాది ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 15మందిని మహిళా సాధికారత సాధింపచేయడానికి కృషి చేసిన వారిని ఎంపిక చేస్తున్నట్లు యామిని కనకతార పేర్కొన్నారు.

## మానసిక విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

వనస్థలిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మానసిక విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రారావు అన్నారు. శనివారం వనస్థలిపురంలోని శాంతినికేతన్ మానసిక పాఠశాలలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ వనస్థలిపురం, ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శాంతినికేతన్ విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. రామచంద్రారావు మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్లు సాధు శ్యాంప్రసాద్, వాసుదేవరావు, నందిరాజు లక్ష్మీనారాయణ, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ అధికారుల రివ్యూ మీటింగ్‌లో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

## ప్రతి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

వనస్థలిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రతి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ సర్కిల్-3 కార్యాలయంలో ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్‌లో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ఆటోనగర్ శ్మశానవాటికలో ఫిట్ చేసిన బోర్లను దొంగలు ఎత్తుకెళ్లడం, ఈ శ్మశానవాటికను పట్టించుకోకపోవడంతో మళ్లీ అధికారులతో రివ్యూ చేసి సెక్యూరిటీ బోర్లను ఫిట్ చేయించాలనే ఉద్దేశంతో అరవై లక్షల వ్యయంతో శ్మశానవాటికలో వివిధ అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన పలు సమస్యలపై జీహెచ్‌ఎంసీలో పైలట్ ప్రాజెక్టు కింద రెండు కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ పలు విభాగాల అధికారులు ఆశాలత, కనకయ్య, స్వప్న, అక్బర్, పాష తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కిట్లు, తోపుడు బండ్లు పంపిణీ



తోపుడుబండిని అందజేస్తున్న ఎంబీటీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్

చాదర్‌ఘాట్ : రంజాన్ మాసంలో మతంతో ప్రమేయం లేకుండా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఎంబీటీ ఆధ్వర్యంలో రేషన్ కిట్లు, స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా కూరగాయలు, పండ్లతో కూడిన తోపుడు బండ్లను పంపిణీ చేసినట్లు పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ తెలిపారు. నాలుగైదు రోజులుగా తాను ఎంబీటీ ఆధ్వర్యంలో చంచల్‌గూడలో ఇలాంటి సేవా కార్యక్రమాలను రంజాన్ మాసంలో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రతి రోజు కనీసం 10మంది నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని వారికి నెలకు సరిపడు 4,500 విలువ గల నిత్యావసర సరుకులతో కూడిన రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు 40 మందికి రేషన్ కిట్లతోపాటు ఆరువేల విలువ గల తోపుడు బండి, అందులో 4వేల విలువ గల కూరగాయలు అమ్ముకునే వారికి కూరగాయలు, పండ్లు అమ్ముకునే వివిధ రకాల పండ్లను, చేతి ఖర్చులకు గాను మరో వేయి రూపాయలు అందజేస్తున్నామని ఆయన వివరించారు. ఇలా ప్రతిరోజు రూ.15వేల విలువ గల నిత్యావసర సరుకులతోపాటు స్వయం ఉపాధికి కూరగాయలు, పండ్లతో కూడిన తోపుడు బండ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు అంజదుల్లాఖాన్ వివరించారు. వీటిని అందుకున్న వారిలో ముస్లిం, హిందువుల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు.

### ఆలయ పాలకమండలి

# నియామకమెప్పుడో..?

● హనుమాన్ ఆలయానికి నిత్యం వీఐపీల తాకిడి

● దరఖాస్తులు దండిగ.. ఎటు తేల్చని నేతలు



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి ప్రధాన ఆలయం



నిత్య పూజలందుకుంటున్న ధ్యానాంజనేయస్వామి

చంపాపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): 400 సంవత్సరాల చరిత్ర కలిగిన కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయానికి పాలకమండలి నియామకం కోసం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ధర్మకర్తల నియామకం ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడుతుంది. జంటనగరాలలోనే ప్రసిద్ధి గాంచిన కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి దర్శనం కోసం నిత్యం వీఐపీలతో పాటు వేలాది మంది భక్తులు వస్తుంటారు. నవంబర్ 19న ఆలయ పాలకమండలి నియామకం కోసం దేవాదాయశాఖ అధికారులు పత్రికా ప్రకటన జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న 114 మందిని ఇటు పోలీస్, అటు దేవాదాయశాఖ అధికారులు విచారణ కార్యక్రమం పూర్తిచేసి దేవాదాయశాఖ అధికారులకు నివేదిక అందజేశారు. ఆలయపాలక మండలిలో 14మంది ధర్మకర్తలను నియమించాల్సి ఉంది. ఇందులో నుంచి ఒకరిని ఆలయ పాలక మండలి చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

### రాజకీయ జోక్యంతో..

కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ పాలకమండలి ధర్మకర్తలుగా ఉండేందుకు పలువురు ఉత్సాహం చూపిస్తున్నారు. పాలకమండలి సభ్యుల సంఖ్య తక్కువ.. దరఖాస్తుదారుల సంఖ్య అధికంగా ఉండడంతో ఎల్బీనగర్ నియోజకవర్గ అధికార పార్టీ నేతలకు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తుంది. చైర్మన్ కుర్చీ కోసం గతంలో పనిచేసిన వారు తిరిగి దరఖాస్తు చేసుకొని పైరవీలు మొదలుపెట్టారు. మరోపక్క కొత్తగా చైర్మన్ గిరి కోసం మొదటి సారిగా దరఖాస్తు చేసుకున్న వారు రాజకీయంగా నేతలపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

### ఆలయ అభివృద్ధి కుంటు..

కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయానికి నూతన పాలకమండలి లేక 6 నెలలు గడుస్తుంది. కొత్త పాలక మండలి నియామకం ఆలస్యం అవుతుండడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయంలో భక్తుల కోసం కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులపై పాలక మండలి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దేవాదాయశాఖతో పాటు దాతల సహకారంతో ఆలయంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవలసి ఉంది. ఆలయంలో చేపట్టే నూతన పనులను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆలయ పాలకమండలి లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఆలయంలో చాలినంత సిబ్బంది లేక భక్తులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయానికి ఏడాదికి సుమారు రూ.15 కోట్ల వరకు ఆదాయం వస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రధాన ఆలయంలో క్యూలైన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, సత్యనారాయణస్వామి మండపం అసంపూర్తిగా ఉండడం, భక్తులకు ఆలయం వెలుపల మరుగుదొడ్లు లేకపోవడం, రాత్రి వేళ ఆలయంలో నిద్రించే భక్తులకు కాటేజీలు లేకపోవడం వంటి ఎన్నో సమస్యలు ఆలయంలో నెలకొన్నాయి. ఆలయ భూములు అన్యాక్రాంతమై సంవత్సరాల తరబడి కోర్టులలో కేసులు నడుస్తున్నాయి. ఆ కేసులను సరిగా పట్టించుకోకపోవడంతో అవి వాయిదాలు పడుతూ వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ పాలకమండలిని త్వరగా నియమించాలని, కోట్లాది రూపాయలు వెచ్చించి ఆలయంలో పలు అభివృద్ధి పనులను చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని భక్తులు వేడుకుంటున్నారు.

## అంధ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని కొనసాగించాలి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఫెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఫెడ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గంగారాం తదితరులు

చాదర్‌ఘాట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వెస్ట్ మారెడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న ప్రభుత్వ అంధ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిజబుల్డ్ (ఫెడ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతినిధులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గంగారాం, అధ్యక్షుడు గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణంతో కూడిన బృందం కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా గంగారాం, నాగభూషణం మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎంతో మంది అంధ విద్యార్థులకు విద్యను బోధించేందుకు అవసరమైన శిక్షణ అందించే ఈ కేంద్రాన్ని ఉపాధ్యాయుల కొరత పేరుతో మూసి వేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో శిక్షణ ఇచ్చేందుకు నియమితులైన ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులను కేంద్రం వెనక్కి పిలిపించుకోవడంతో అంధ విద్యార్థులకు అవసరమైన తీరులో బోధించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చే వారు కరువయ్యారని వారు వివరించారు. ఇటీవల జరిగిన డీఎస్సీలో నియమితులైన 150 మంది ఉపాధ్యాయులు ఇందులోనే శిక్షణ పొందిన విషయాన్ని వారు గుర్తుచేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో అంధులైన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అందకుండా పోయే ప్రమాదముందని వారు తెలిపారు. కేంద్రం ఆధీనంలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజ్యువల్లీ హ్యాండీ క్యాప్డ్(ఎన్‌ఐవీహెచ్) ద్వారా నడుపుతున్న ప్రభుత్వ అంధ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని తిరిగి యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి తక్షణమే వెనక్కి తీసుకున్న ఇద్దరు ఉపాధ్యాయులను తిరిగి యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## 118 జీవో సమస్యకు శాశ్వత పరిష్కారం : మధుయాష్కీ



మార్నింగ్ వాకర్స్‌తో కలిసి సమస్యలను తెలుసుకుంటున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గెలిచినా.. ఓడినా ఎల్లప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-3 లోని థీమ్‌పార్కు, బీఎన్‌రెడ్డినగర్ ఆడిటోరియంలోని పార్కుల్లో మధుయాష్కీగౌడ్ మార్నింగ్‌వాక్ చేపట్టి వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ముప్పై ఏళ్ల క్రితం తమ కష్టార్జితంతో హెచ్ఎండీఏ అనుమతులతో కూడిన ప్లాట్లను కొనుగోలు చేశామని, వాటికి రిజిస్ట్రేషన్ లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకవచ్చిన 118జీవోతో తమకు కొత్త సమస్యలు వచ్చిపడ్డాయని, ఈ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు మధుయాష్కీగౌడ్‌ను కోరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు వందల కోట్ల రూపాయలను ఖర్చుచేయడం జరుగుతుందన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి లబ్ధికొరకు తీసుకవచ్చిన 118 జీవోతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జీవో చిత్తుకాగితం కన్నా పనికిరానిదని ఎద్దేవ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన రాజకీయ లబ్ధికోసమే తప్పులతడక జీవోని తీసుకవచ్చి ఇక్కడ ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా రిజిస్ట్రేషన్ సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కోవడం బాధాకరం అన్నారు. ఈ 118 జీవో సమస్యకు సీఎం సహకారంతో అతిత్వరలోనే శాశ్వత పరిష్కారం చేపడతామని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీ తిప్పర్తి యాదయ్య, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు సదాశివుడు, కుట్ల నర్సింహయాదవ్, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయిత్రీనగర్ ఫేజ్-2 కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ సంక్షేమ అధ్యక్షుడు రమేష్‌కుమార్ తదితరులు - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

## ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ ఆధ్వర్యంలో కళాశాల నూతన కమిటీ అధ్యక్షుడిగా సంజయ్, కార్యదర్శిగా విశాల్, ఉపాధ్యక్షుడిగా సద్గుర్, సహాయ కార్యదర్శిగా శాలీం రాజ్‌తో పాటు 8మంది సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు ప్రణయ్, హరీష్ పాల్గొన్నారు.

## నేడు ఫెన్సింగ్ సెలెక్షన్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫెన్సింగ్ ట్రయల్స్‌ను ఎల్బీనగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఫెన్సింగ్ సంఘం సెలెక్షన్ కమిటీ సభ్యుడు సందీప్‌జాదవ్ వెల్లడించాడు. ఆదివారం జరిగే ఈ ట్రయల్స్‌లో ప్రతిభ కనబర్చిన వారు జాతీయ సబ్ జూనియర్ పోటీల్లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. అండర్-14 విభాగంలో ట్రయల్స్ నిర్వహిస్తున్నామని, 2011 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనడానికి అర్హులని చెప్పారు. ట్రయల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు వారి సొంత ఫెన్సింగ్ కిట్లతో హాజరవ్వాలని సూచించారు.

## వ్యక్తి అదృశ్యం



వనస్థలిపురం: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గుమ్మడవల్లికి చెందిన ఎలుగూరి శ్రీనివాస్(50) తన సెల్‌ఫోన్ వెంట తీసుకరాకుండా పనిమీద గురువారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్‌కి వచ్చాడు. శ్రీనివాస్ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు శనివారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అనధికార మీడియా, అసభ్యకరమైన వీడియోలను ప్రోత్సహిస్తున్న

## బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత పదవిలో ఒకటైన తెలంగాణ సీఎం పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, అనధికార మీడియా ద్వారా అసభ్యకరమైన వీడియోలను పోస్టు చేస్తూ ప్రోత్సహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి సరూర్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం కాదని ఆయన అన్నారు. కొంతమంది బీఆర్‌ఎస్ సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్స్‌కు చెందిన వ్యక్తులు వల్గారిటీని ప్రమోట్ చేస్తూ సమాజాన్ని ప్రభావితం చేసేలా ప్రవర్తిస్తున్నారని వాళ్లు తమ పద్ధతి మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ తమ కుటుంబ సభ్యులకు ఇదే వల్గారిటీని నేర్పుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే వల్గారిటీని ప్రమోట్ చేయడం కాదని ఇటీవల సుప్రీంకోర్టు రణబీర్ అహ్లాబాదియా కేసులో స్పష్టం చేసిందని ఆయన గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో కూడిన బృందం ఇలాంటి వీడియోలు, సోషల్ మీడియాలో అసభ్యకరమైన పదజాలంతో కూడిన పోస్టులను పెట్టేందుకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని తక్షణమే మానుకోవాలని ఆయన సూచించారు. రాజకీయంగా పార్టీ పరంగా ఒకరిపై మరొకరు విమర్శించుకోవాలి గాని, వాటిని తమ మనవళ్లు, మనవరాళ్లతో మాట్లాడించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో అనధికార మీడియాతో పోస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేయడంతోపాటు ఆయన కుటుంబీకులపై దూషణలు చేస్తారా. ఇదే కుటుంబీకులపై దూషణలు చేస్తే మీరు ఊరుకుంటారా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇకనైనా అలాంటి వాటిని మానుకోవాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన నిందితులు

హయత్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని హయత్‌నగర్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్ బంజారాకాలనీకి చెందిన మెగావత్ శ్రీను, కనావత్ రాము కలిసి హయత్‌నగర్ పరిసర గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తారు. శనివారం ఇంజాపూర్ రోడ్డు గుండా ఆటోలో 7క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే హయత్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆటోను సీజ్‌చేసి నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.





అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

## చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్‌గూడ పరిధిలోని నోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రిసెర్చ్ సెంటర్‌లో శనివారం రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో జడ్జి మొక్కలను నాటారు. అనంతరం జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్ఐ భద్యానాయక్ యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్, మాజీ ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ ఎం. విజయనిర్మల, సెక్రెటరీ కృష్ణారావు, ప్రిన్సిపాల్, అకాడమిక్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి జీపీలు, పీపీలు చొరవ చూపాలి

● రంగారెడ్డి జిల్లా ఎంఎస్‌జే పట్టాభిరామారావు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి ప్రభుత్వ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చొరవ చూపాలని రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషెన్స్ జడ్జి పట్టాభిరామారావు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కోర్టుల కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రభుత్వ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జ్యోతి, సాయిరెడ్డి, బర్ల సునీత, మీనాక్షి పాల్గొన్నారు.



చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజుకు ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ తదితరులు

## సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

చాదర్‌ఘాట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి కించపరచే విధంగా వ్యవహరించిన బీఆర్‌ఎస్ మలక్‌పేట నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్‌తో కూడిన బృందం శనివారం చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజును కలిసి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకుడు పగిళ్ల నర్సింగ్‌తో కూడిన కార్యకర్తల బృందం శుక్రవారం దహనం చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన శ్రీనివాస్ చాదర్‌ఘాట్ పీఎస్‌లో ఫిర్యాదు చేసి బీఆర్‌ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్‌సింగ్, సాయిరాం, షకీల్, డివిజన్ల అధ్యక్షులు రాహుల్‌సింగ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.



లెప్రసీ కుటుంబాలకు నిత్యావసరాలను అందిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి పక్కన మాజీ కౌన్సిలర్ విద్యావతివిజయేందర్‌రెడ్డి

## కుష్టు వ్యాధిగ్రస్థులకు సహాయం చేయాలి

● మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

● 550 లెప్రసీ కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్థుల పట్ల చిన్నచూపు తగదని.. వారికి చేతనైన సహాయం అందించాలని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. రిలయబుల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి 4వ వార్డు శాంతినగర్(లెప్రసీకాలనీ)వాసులకు శనివారం హిందు మిత్ర యువజన సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ రవీందర్‌రెడ్డి హాజరై లెప్రసీ జేడీ జాన్‌బాబు, ట్రస్ట్ డైరెక్టర్ రవి, తాజా మాజీ కౌన్సిలర్ విద్యావతివిజయేందర్‌రెడ్డితో కలిసి కుష్టు వ్యాధిగ్రస్థులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 550 మంది లెప్రసీ కుటుంబాలకు నిత్యావసరాలను అందించడం గొప్ప విషయం అన్నారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుష్టు అంటు వ్యాధి కాదని వారితో అందరు ప్రేమగా మెలగాలని సూచించారు. మున్సిపాలిటీ నుంచి లెప్రసీ కాలనీకి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎస్ స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్, హిందుమిత్ర సంఘం అధ్యక్షుడు రాజు, రఘుతో పాటు లెప్రసీ కుటుంబాలు పాల్గొన్నారు.